క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మంగళవారం ఆయుర్వేద మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ దాత గజం నాగ శివరాం సహకారంతో 3 వేల మందికి మజ్జిగ పంపిణీ చేశామన్నారు. తొలకరి వర్షాలు పడి వాతావరణంలో మార్పు వచ్చేంత వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు



నందిగామ: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.నరేష్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పలువురు చిరు వ్యాపారులను ఆ ప్రాంతం నుంచి పంపించారు. అదే విధంగా నిబంధనలు పాటించని పలు వాహన చోదకులకు జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు దగ్గరే ఉంచుకోవాలన్నారు. అదే విధంగా కొందరు చిరు వ్యాపారుల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఈ నేపథ్యంలో నిర్దేశించిన ప్రాంతాల్లోనే విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేట తహసీల్దార్‌గా సూర్యారావు



జగ్గయ్యపేట: జగ్గయ్యపేట తహసీల్దార్‌గా సూర్యారావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. డీటీ నాగరాజు ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్నాడు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా పని చేస్తున్న సూర్యారావును జగ్గయ్యపేట తహసీల్దార్‌గా నియమించారు.

కొనసాగుతున్న భానుడి ప్రతాపం



నందిగామ: భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం మంగళవారం నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 43.0 డిగ్రీలు నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు 29.0 డిగ్రీలుగా నమోదయ్యాయన్నారు. ఇదిలా ఉండగా ఎండకు తోడు వడగాల్పులు కూడా వీస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మరి కొద్ది రోజులు ఎండలు ఇదేవిధంగా ఉంటాయని ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

లంక భూముల్లో హైఓల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఇబ్రహీంపట్నం: మండలంలోని చినలంక వ్యవసాయ భూముల్లో హైఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్కీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో రైతులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు మూడు మోటార్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ చొప్పున రూ.10 లక్షల వ్యయంతో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వరదల తాకిడిని తట్టుకునేందుకు ఎత్తైన స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లు వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, నల్లమోతు ప్రకాష్, ఎన్.దయాకర్ పర్యవేక్షించారు.

పేదరిక నిర్మూలనకు సీఎం వైఎస్ జగన్ కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- జయంతి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ప్రజాప్రతినిధులు

జయంతి(వీరులపాడు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. అన్ని రంగాల అభివృద్ధి.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు.

అగ్రవర్ణాలకూ సంక్షేమ పథకాలు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు సైతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గత ప్రభుత పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గ్రామ పంచాయతీ భవనాలు కూడా లేని దీన స్థితిలో గ్రామీణ ప్రాంతాలు కునారిల్లాయని ఆయన గుర్తు చేశారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సచివాలయ భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.

అండగా ఉండి ఆశీర్వదించాలి..

ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఉప సర్పంచ్ ఇప్పల సుబ్బమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, సాంబిరెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పాలన



పేటలో డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మంగళవారం శంకుస్థాపన చేశారు. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 1వ వార్డు, 6వ వార్డులను అనుసంధానం చేస్తూ డ్రెయిన్, 8, 9, 28వ వార్డు(మాంసం మార్కెట్)ల్లో డ్రెయినేజీలను నిర్మిస్తున్నామన్నారు. ఈ డ్రెయినేజీల కోసం ప్రజలు గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దృష్టికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తీసుకెళ్లడంతో పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, సామినేని మనోహర్, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, నాయకులు కన్నమాల సామ్యూల్, పూసాల పుల్లారావు, కాశీ కిషోర్, కాసర్ల బాలస్వామి, పోతురాజు రంగారావు,గాదె సుభాష్, వీర్ల శ్రీను, కోమటి శ్రీను, భానుప్రకాష్ పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రీ సర్వే



భూముల రీ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: దీర్ఘకాలంగా నెలకొని ఉన్న భూవివాదాల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా డ్రోన్ల పని తీరు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో డ్రోన్ కెమెరాల ద్వారా భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. సర్వే చేయటంతో పాటు హద్దు రాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా సర్వే వివరాలను డిజిటలైజ్ చేసి రైతుల భూ కమతాలకు ప్రత్యేకంగా గుర్తింపు నంబరు కూడా కేటాయిస్తున్నామన్నారు.

రైతులు సద్వినియోగించుకోవాలి..

సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సూచించారు. దాదాపు 100 ఏళ్ల తరువాత భూముల రీ సర్వే జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలంగా నెలకొని ఉన్న భూ వివాదాలతో రైతులు అవస్థలు పడుతుండటంతో స్పందించిన సీఎం జగన్ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. సర్వే సిబ్బంది నిష్పక్షపాతంగా సర్వే చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన ఆదేశించారు. రైతులు కూడా వివాదాలకు తావులేకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను అధికారులు పర్యవేక్షించటంతో పాటు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో అన్ని వర్గాలకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు ఈశ్వరప్రగడ రంగారావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, బాపట్ల సాంబయ్య, తానూరి రాము, యాకుబ్ అలీ, మందా మరియమ్మ, విశ్వనాథపల్లి కృష్ణారావు, మన్నం దాసు, జయరాజు, వీఆర్వోలు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన



సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: క్యాలెండర్ ద్వారా ముందుగా ప్రకటించిన విధంగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలనను అందిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జగనన్న అందించే సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ మంగళవారం ఆవిష్కరించారు.

మాటకు కట్టుబడి పాలన..

అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముందుగానే క్యాలెండర్ ప్రకటించి మరీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఇచ్చిన మాటకు కట్టుబడి వెనుకడుగు వేయకుండా పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, కౌన్సిలర్లు కొలగాని రాము, వట్టెం మనోహర్, కాశీ అనురాధ కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28వ వార్డులో డ్రెయినేజీ పరిశీలన..

పట్టణంలోని 28వ వార్డు రంగుబజారులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వార్డు కౌన్సిలర్ షేక్ సిరాజున్ సత్తార్ మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు తెలిపారు. ఈ సమస్యపై సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందించిన చైర్మన్ రాఘవేంద్ర డ్రైనేజ్‌ని పరిశీలించారు. త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

శివగంగ శ్రీశారదా పీఠాధిపతి ప్రత్యేక పూజలు



జి.కొండూరు: ధర్మపర్యవేక్షణార్థం దేశయాటన చేస్తున్న శివగంగ శ్రీ శారదాపీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామి తన స్వగ్రామం వెల్లటూరు గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. స్థానికంగా ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. గ్రామంలో ఉన్న గోశాలను సందర్శించిన స్వామిజీ, గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

10 వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేయు ప్రధాన వనరైన హెడ్ వాటర్ వర్క్స్‌లో పైపులైను పూర్తిగా దెబ్బతినడంతో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత 30 ఏళ్లగా ఉపయోగిస్తున్న పైపులైన్లు పాడై శిథిలావస్థకు చేరడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను చేపట్టామన్నారు. తాగునీటి తాత్కాలిక అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమస్యను అధిగమించడానికి తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వార్డుల్లో ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాబు, నాయకుడు పూసాల పుల్లారావు, డీఈఈ శివకోటేశ్వరరావు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 93811 90226, 98499 07979, 80961 25157, 93477 86186 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలోని గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల్లో బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు గ్రంథాలయం ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రంథాలయం–దాని ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. అలాగే ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ బోధించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, బీడీసీ మల్లిక, సిబ్బంది రమేష్, సత్యవతి, డి.వర్షిత పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో నడుచుకోవాలి..

కంచికచర్ల(వీరులపాడు): అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో కంగారు పడకుండా సమయస్ఫూర్తితో నడచుకోవాలని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ అథరైజ్డ్ ట్రైనర్ నారాయణ పేర్కొన్నారు. కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తనకు తాను రక్షించుకోవటంతో పాటు తోటి వారిని కూడా కాపాడాలని సూచించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ

ఇబ్రహీంపట్నం: సమాజంలో మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఏపీజెన్‌కో థర్మల్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీటీపీఎస్‌లో మంగళవారం మొక్కలు నాటారు. మనుషులకు జీవనాధారం మొక్కలే అన్నారు.

సచివాలయ సిబ్బందికి చార్జి మెమోలు

సాక్షి ఎఫెక్ట్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఏవో మాధవశర్మ

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయ సిబ్బందికి చార్జి మెమోలు అందించినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో మాధవశర్మ తెలిపారు. సచివాలయానికి తాళం అనే వార్త మంగళవారం ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు ఏవో సచివాలయ సిబ్బందిని విచారించారు. సోమవారం సచివాలయానికి తాళం వేయటంతో పాటు సిబ్బంది గైర్హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చార్జి మెమోలు అందించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి శివాజీ తదితరులు ఉన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం



నందిగామ ఏఎంసీలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా ఉండటమే కాకుండా పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తూ కొండంత భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.

రైతు సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యం

ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో వ్యవసాయం పండుగ చేసేలా పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

క్వింటాకు రూ.6,850 మద్దతు ధర..

రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పసుపునకు క్వింటాకు రూ.6,850 మద్దతు ధర కల్పించారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నాణ్యత స్వల్పంగా దెబ్బతినటంతో బహిరంగ మార్కెట్‌లో సరైన ధర రావటం లేదని క్వింటాకు రూ.5,200 నుంచి 5,500 మాత్రమే వస్తుందన్నారు. దీంతో మద్దతు ధర అందక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవస్థలు చూసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలిచారని గుర్తు చేశారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు..

రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పంటను విక్రయించుకుని నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని జగన్‌మోహనరావు సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాతలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, పీఏసీఎస్ చైర్మన్లు మేరుగ రామకోటిరెడ్డి, పాములపాటి రమేష్, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కొండా కృష్ణారెడ్డి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివ నాగేశ్వరరావు, పాకాలపాటి కిరణ్, దాసు, ఎండీ అమీన్, ఐలపోగు రాంబాబు, విశ్వనాథపల్లి కృష్ణారావు, పట్టా శ్రీను, మార్త శ్రీను, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.7 లక్షల చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చిన్నచిన్న సమస్యలకు అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అప్పుల బాధ తాళలేక ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామానికి చెందిన కాలితిరిపి వెంకటేష్ అప్పుల బాధ తాళలేక రెండు నెలల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. ఆత్మహత్యలకు పాల్పడిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు చేయనంతగా రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయటంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని తెలిపారు.

తమ కుటుంబం రుణపడి ఉంటుంది..

భర్త మృతితో నలుగురు పిల్లల పోషణ భారంగా మారి ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్న తమకు రూ.7 లక్షల నష్టపరిహారం అందించి ఆదుకున్న సీఎం జగన్‌కు తమ కుటుంబం రుణపడి ఉంటుందని మృతుని భార్య వాణి పేర్కొన్నారు. నష్టపరిహారం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చింతోటి ప్రసాద్, వైఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామం బీసీ కాలనీలో డ్రెయినేజీ లేక పడుతున్న ఇబ్బందులను కాలనీకి చెందిన బీసీ నాయకులు కొందరు వైఎస్సార్ సీపీ నాయకులు యరమల రాంభూపాల్‌రెడ్డిని మంగళవారం కలిసి వివరించారు. దీనిపై స్పందించిన వైఎస్సార్ సీపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డాక్టర్ హనిమిరెడ్డి స్పందించి బీసీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో రాంభూపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పీ ధర్మరాజు, వైస్ ఎంపీపీ పీ రత్నబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి కాలనీలో డ్రెయినేజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా దాతృత్వాన్ని ప్రకటించిన ప్రవాసాంధ్రులు డాక్టర్ హనిమిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.